క్లుప్తంగా

వెంకన్న ప్రచార రథానికి బ్రహ్మరథం


జగన్నాథపురం లక్ష్మీనగర్‌కు చేరిన శ్రీవేంకటేశ్వరస్వామి ప్రచార రథం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): సనాతన ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తన వాహిని సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడకు చేరుకున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ప్రచార రథానికి భక్తులు బ్రహ్మరథం పట్టారు. జగన్నాథపురం లక్ష్మీనగర్ వీధుల్లో ఊరేగిన ప్రచార రథానికి భక్తులు, మహిళలు, చిన్నారులు కలశలతో నీటిని రథం ముందు పోస్తూ, పూలు చల్లి స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రచార రథ గాయకుడు కరుటూరి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రచార రథాన్ని 2015 కర్ణాటకలోని రాయచూరులో ప్రారంభించినట్టు చెప్పారు. శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం వద్ద 13వ వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మీనగర్‌కు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ప్రచార రథం రావడం ఇక్కడి ప్రజల అదృష్టమని ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

అంధుని స్వయం ఉపాధికి చేయూత


గణేష్‌కు మొదటి కొనుగోలు సొమ్ము ఇస్తున్న హరీష్, రామారావు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కంటి చూపు కొరవడినప్పటికీ.. సమాజంలో నిలదొక్కుకునేందుకు వ్యాపారం చేస్తానంటూ ధైర్యంగా ముందుకొచ్చిన ఓ అంధుడికి హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ అండగా నిలిచింది. ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ స్థానిక సాంబమూర్తినగర్‌లోని బధిరుల పాఠశాల వద్ద ఓ మొబైల్ షాపును ఏర్పాటు చేయించారు. మంగళవారం ఈ షాపును సబ్ రిజిస్ట్రార్ రామారావు ప్రారంభించారు. అంతేకాకుండా హరీష్, రామారావు మొదటి కొనుగోలు చేసి, షాపు యజమాని అయిన దివ్యాంగుడు గణేష్‌కు నగదు అందించారు. షాపు ఏర్పాటు చేయించిన హరీష్‌ను రామారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రస్టీ సుబ్బారావు, సభ్యులు శ్రీను, కోటిబాబు, చార్లీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

భోగిగణపతి పీఠంలో శ్రీవారి పాదాల ప్రతిష్ఠ


పీఠంలో ప్రతిష్ఠించిన తిరుమల శ్రీవారి పాదాలు

బోట్‌క్లబ్: తిరుమల పాదయాత్ర చేపట్టి స్వయంభు విఘ్నేశ్వర విగ్రహానికి పంచలోహాల కాంస్య కవచయజ్ఞం పూర్తిచేసిన సందర్భంగా స్థానిక దూసర్లపూడి వారివీధిలో భోగిగణపతి పీఠం ప్రాంగణంలో శ్రీవారి పాదాలను ప్రతిష్ఠించారు. మంగళవారం పాదాల ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకుడు రమణరాజు మాట్లాడుతూ పాదయాత్రలో టీటీడీ అందించిన పంచలోహ శ్రీవారి పాదుకలకు శ్రీకాళహస్తి, ఇంద్రకీలాద్రి, ద్వారకా తిరుమల, ద్వారపూడి అయ్యప్పస్వామి, పెద్దాపురం మరిడమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు వివరించారు. నవంబర్ 20 నుంచి జనవరి 9 వరకూ ప్రతి సోమవారం కార్తిక, ధనుర్మాసాల్లో శివకేశవ ఆరాధన నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాలు ప్రారంభం


సంగీత గానలహరి నిర్వహిస్తున్న కృష్ణమాచార్యులు బృందం

బోట్‌క్లబ్: శ్రీ షిర్డి సాయిబాబా పుణ్యతిథి మహోత్సవాలు స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని ప్రాంగణంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయిబాబాకు 108 కలశలతో పూజలు చేశారు. ఉదయం బాబావారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రి సత్కళావాహిని వ్యవస్థాపక కార్యదర్శి ఈవీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్తి సంగీత గానలహరి జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కుంజికా లక్ష్మి, పి.గాంధీగుప్త, మద్దిరాల కృష్ణ, జి కాత్యాయని, ఆకెళ్ల స్వాతిశ్రీ పాల్గొన్నారు.


రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చిన మాధవనగర్ కనకదుర్గ అమ్మవారు


బంగారు చీరలో దర్శనమిచ్చిన బాలాత్రిపురసుందరి అమ్మవారు


వెండిచీరలో దర్శనమిచ్చిన దేవాలయం వీధిలోని బాలాత్రిపురసుందరి అమ్మవారు


కరపలో విద్యుద్దీపాలంకరణలో హంస వాహనం


కరప దసరా సంబరంలో ఊరేగిస్తున్న ఏనుగు వాహనం


కరపలో దుర్గాదేవి అమ్మవారికి నిర్వహిస్తున్న గ్రామోత్సవం

అంబరాన్నంటిన దసరా సంబరం

- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- కరపలో ఆకట్టుకున్న ఊరేగింపు

కరప: కొద్ది రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా తెల్లవార్లూ కరపలో నిర్వహించిన దసరా సంబరం అంబరాన్నంటింది. ముందుగా దుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఉంచి, బ్యాండుమేళం, బాణసంచాతో గ్రామంలో ఊరేగించారు. కొత్తపేట, మెరకవీధి, పల్లపువీధి, సీతమ్మవీధి, నీలయ్యతోట, రామకంచిరాజునగర్ కాలనీ, బీసీవీధులు, ఎస్సీకాలనీ వారు సంయుక్తంగా ఏనుగు, హంస వాహనాలను తయారుచేశారు. వాటిని కాగిత పూలు, వివిధ రకాల బొమ్మలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఒక్కొక్క వాహనం ముందు బ్యాండుమేళం, సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో ఊరేగించారు. తెల్లవారుజామున ఏనుగు, హంస వాహనాలను ఎదురెదురుగా ఉంచి, జమ్మిపత్రితో శమీపూజ చేశారు. ఇలా చేస్తే పాడిపంటలు వృద్ధి చెంది, గ్రామం సుభిక్షంగా ఉంటుందని ప్రజల విశ్వాసం. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి కరప సంబరాన్ని తిలకించారు.

పోలీసు బందోబస్తు

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్, కరప ఎస్సై ఎస్.రామకృష్ణతో పాటు గొల్లపాలెం, కోరంగి, ఇంద్రపాలెం, సర్పవరం పోలీసుస్టేషన్ల నుంచి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పూజాదికాలు నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో ఉంచి, బ్యాండుమేళాలతో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. నడకుదురులో దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, బ్యాండుమేళాలు, బాణసంచాతో గ్రామోత్సవం నిర్వహించారు. అరట్లకట్ట శివాలయంలోని మల్లేశ్వరస్వామి సమేత భ్రమరాంబదేవిని స్వర్ణకవచాలంకారంలో అలంకరించి, పూజాదికాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. యండమూరులోని పురాతన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు ప్రత్యేకపూజలు చేశారు. కరప, వలసపాకల, పెనుగుదురు, కొరుపల్లి, నడకుదురు తదితర గ్రామాల్లో భవానీలు దుర్గాదేవి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. విజయవాడ వెళ్లి, దుర్గాదేవి అమ్మవారి దర్శనానంతరం దీక్షను విరమించారు.


బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు

ఘనంగా ముగిసిన దసరా వేడుకలు

కాకినాడ రూరల్: దసరా వేడుకలు ఘనంగా ముగిశాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మికతను చాటాయి. సోమవారం కొందరు, మంగళవారం కొందరు దసరా పండగను జరుపుకొన్నారు. శ్రీపీఠంలో సోమవారం రాత్రి మహాలక్ష్మీదేవిగాను, మంగళవారం రాత్రి రజత కవచంతో విజయలక్ష్మి దేవిగా భక్తులకు ఐశ్వర్యాంబిక అమ్మవారు దర్శనమిచ్చారు. గ్రామగ్రామాన అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రాయుడుపాలెం శేషాద్రినగర్‌లో బాలకనక దుర్గమ్మ ఆలయంలో ఉదయం సువాసినిలకు పూజ, సాయంత్రం శమీ పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ లింగం రవి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిబిక అమ్మవారిని మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

భక్తులతో ఆలయాల కిటకిట

బోట్‌క్లబ్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఆలయాలకు భక్తులకు పోటెత్తారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి., ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ తదితర ప్రముఖులు దర్శించుకుని, పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్ రెడ్డి స్వాగతం పలికారు. అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు వెండిచీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో రాపత్తి రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు వెండి చీరలో దర్శనమిచ్చారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక సంతచెరువు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సుమారు 300 మంది మహిళలు కలశలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జొన్నాడ చినబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

కరప: శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం దుర్గాదేవి ఆలయాలు, రామాలయాల వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, పూజాదికాలు జరిపారు. విజయ దశమితో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా కరప మెరకవీధి రామాలయం, వలసపాకల దుర్గాదేవి, పెనుగుదురు శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కరపలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్కా వీరభద్రరావు, దేవు మధువీరేష్, నక్కా సత్తిబాబు, దేవు జమీందార్, గోన శ్రీను, దేవు వీరబాబు, వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు పాల్గొన్నారు.


అరట్లకట్ట శివాలయంలో స్వర్ణ కవచాలంకారంలో భ్రమరాంబదేవి


కలశలతో ఊరేగుతున్న మహిళలు


రాయుడుపాలెం శేషాద్రినగర్‌లో నిర్వహిస్తున్న సువాసిని పూజ


కరప రామాలయం వద్ద జరుగుతున్న అన్న ప్రసాద వితరణ

అమ్మవారికి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాకినాడ 30వ డివిజన్ వాజపేయుల వారి సందులో ఉన్న అంబికామాతను మంగళవారం సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా ఆయనకు తలపాగా పెట్టి, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబికామాత ఆశీస్సులతో అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. గతంలో వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షుడు ఫ్రూటీ కుమార్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు దాండియా కార్యక్రమంలోను పాల్గొనే వాడినని గుర్తు చేసుకున్నారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణకుమార్, జ్యోతిరామ్ చౌదరి, మహేంద్రకుమార్ జైన్, హీరాచంద్, మంగిలాల్ సోని, మల్లిపాముల గణపతి తదితరులు పాల్గొన్నారు.


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా సర్పవరం గ్రామం శెట్టిబలిజపేటలోని కనకదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంగళవారం దర్శించుకున్నారు. గ్రామస్తులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. అంతా సుభిక్షంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ నాయకుడు పుల్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ గుత్తుల శ్రీను, కొప్పిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.


సర్పవరం శెట్టిబలిజపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

రజత కవచ అలంకరణలో ఐశ్వర్యాంబిక

కాకినాడ రూరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు రజత కవచ అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దసరా వేడుకల ముగింపులో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం జరపనున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయనున్నారు. సాయంత్రం నుంచి ఐశ్వర్యాంబిక అమ్మవారు కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామిగా భక్తులకు దర్శనమిస్తారు.


శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

పోలియో మహమ్మారి రాకుండా రెండు చుక్కలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

బోట్‌క్లబ్: చిన్నారులను పోలియో మహమ్మారి సోకకుండా రెండు పోలియోచుక్కలు తప్పకుండా వేయించాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి అన్నారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సర్పవరం జంక్షన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1962 అక్టోబర్ 24న పోలియో వ్యాధి నివారణ కోసం అల్బర్ట్ సబిన్ అనే శాస్త్రవేత్త వ్యాక్సిన్ కనుగొన్నట్టు పేర్కొన్నారు. చిన్నారులకు వారి తల్లిదండ్రులు పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని కోరారు. సంఘ నాయకుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ పోలియో వ్యాధిపై అవగాహన కల్పించేందుకు అందరూ కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ సభ్యులు అడబాల రత్నప్రసాద్, రాజా పాల్గొన్నారు.

గూడ్స్ ఆటో వర్కర్స్ సంఘ నేతల క్షమాపణ

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద అమరావతి మినీ గూడ్స్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు క్షమాపణ తెలిపారు. నాలుగు నెలల క్రితం ఏర్పాటు చేసిన సంఘం ద్వారా జీవనోపాధి పొందుతున్నామని సంఘ అధ్యక్షుడు వేడిద నాగరాజు, ఉపాధ్యక్షుడు గెద్దాడ నాగరాజు, కార్యదర్శి తోలుము రాంబాబు తదితరులు విలేకరులకు చెప్పారు. ఇటీవల తమ గూడ్స్‌ఆటోలను వేరే యూనియన్ నాయకులు అడ్డుకుని, ఎమ్మెల్యే పేరును ప్రస్తావించడంతో తాము తప్పుగా భావించామని చెప్పారు. ఇందుకు క్షమాపణ కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే వెంటే తాము ఉన్నామని స్పష్టం చేశారు.సీఐటీయూ నాయకుడు మేడిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు కాశీ, నల్ల శ్రీను, రాయుడు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేలాడే తీగలకు చెక్

- గడప గడపకూ.. కార్యక్రమంలో సమస్యలకు తక్షణ పరిష్కారం
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటనలో వినతులకు మోక్షం

కాకినాడ రూరల్: కరెంట్ తీగలు.. తగిలితే ప్రాణాలకే ముప్పు. ఇరుకైన కాలనీలు, వీధుల్లో.. ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వేలాడుతున్నా.. ఇళ్ల యజమానులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. చిన్నారులు డాబాపై వెళ్లి ఆడుకుంటుంటే.. పెద్దలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాలి. ఇటీవల రాయుడుపాలెంలో నిర్మాణంలో ఉన్న ఇంటి పక్కన విద్యుత్ తీగలు ఓ కార్మికుడిని బలిగొన్నాయి. చేతికి తాకేలా ఉండే తీగలు ఊపిరి తీసేలా ఉన్నా.. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం.. చోద్యం చూసేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఎమ్మెల్యేలు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడంతో.. అనేక సమస్యలకు తక్షణ మోక్షం లభిస్తోంది. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న విద్యుత్ సమస్యలు తక్షణం పరిష్కారం అవుతున్నాయి.

అధికారులతో కలిసి దాదాపు ఏడాదిన్నరగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను ఆలకిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఎక్కువ మంది విద్యుత్ సమస్యలు తెలుపుతున్నారు. ఇళ్ల మధ్య వేలాడుతున్న తీగలను తొలగించాలని, రోడ్డుకు అడ్డుగా లేదా ఇంటిపై నుంచి అపాయకరంగా మారిన తీగలను తొలగించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యేతో పర్యటనలో ఉంటున్న ఆయా ప్రాంతాల విద్యుత్ ఏఈ, లైన్‌మెన్లు నమోదు చేసుకుని, తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వేలాడే తీగలు తొలగింపుతో పాటు ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్నారు.


రమణయ్యపేట పంచాయతీ ఈశ్వర్‌నగర్ ప్రధాన మార్గంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగింపుతో విశాలమైన రోడ్డు

ఈశ్వర్‌నగర్ సమస్యకు మోక్షం

రమణయ్యపేటలో ఏపీఎస్పీని ఆనుకుని ఉన్న ఈశ్వర్‌నగర్ కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డుకు అడ్డుగా విద్యుత్ స్తంభం ఉంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దానిని తొలగించి, పక్కగా కొత్త స్తంభం ఏర్పాటు చేయలని కాలనీ అసోసియేషన్ పెద్దలు ఎమ్మెల్యే కన్నబాబును విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ స్తంభం తొలగించి, పక్కగా కొత్తది ఏర్పాటు చేశారు. దీంతో వారంతా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల 49వ డివిజన్, రమణయ్యపేట సచివాలయం–5 పరిధిలో గడప గడపకూ కార్యక్రమంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగల తొలగింపు కోసం ఎమ్మెల్యేకు ఎక్కువ విన్నపాలు రావడంతో, అక్కడున్న ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ వీరబాబును పిలిచి తక్షణం సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో రెండు రోజుల్లోనే తీగలు సరిచేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కాకినాడ రూరల్, కరప మండలాల్లో మొత్తం 62 సచివాలయాలతో పాటు అర్బన్‌లో 8 డివిజన్లలో సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చాలావరకు పూర్తవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రమణయ్యపేట ఎఫ్‌సీఐ కాలనీలో గడప గడపకూ కార్యక్రమానికి ముందుగా ప్రమాదభరితంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు


సరిచేసిన తర్వాత..

ఎఫ్‌సీఐ కాలనీలో సమస్యకు మోక్షం



రమణయ్యపేట ఎఫ్‌సీఐ కాలనీలో ఇటీవల ఎమ్మెల్యే కన్నబాబు అధికారులతో పర్యటించి గడప గడపకూ కార్యక్రమం చేపట్టారు, వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను కాలనీవాసులు ప్రధానంగా ఎమ్మెల్యే కన్నబాబు దృష్టికి తీసుకువెళ్లారు. రెండు రోజుల్లోనే తీగలు సరిచేశారు.
– దేవుపల్లి సురేష్, ఎఫ్‌సీఐ కాలనీ, రమణయ్యపేట

వినతులకు తక్షణ పరిష్కారం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ముఖ్యంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఎమ్మెల్యే కన్నబాబుకు విన్నవించుకోవడంతో, ఆయన ఆదేశాల మేరకు తక్షణం పరిష్కరిస్తున్నాం.
– శ్రీనివాస్, ఏఈ, డి8 సెక్షన్, ఏపీఈపీడీసీఎల్